సింహాద్రినాధుని దర్శించుకున్న రాష్ట్ర సమచార కమిషనర్

విశాలాంధ్ర-సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారిని రాష్ట్ర సమాచార కమిషనర్, చావలి సునీల్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి. వేంద్ర త్రినాధ రావు ఆహ్వానం పలుకగా ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, సీతారామాచార్యులు నాదస్వర వేదమంత్రాలతో ముందుగా స్వామివారి కప్పస్తంభము ఆ లింగనము చేయించి స్వామివారి బేడ మండపం ప్రదక్షణ అనంతరము స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన వేద పండితులు వేద ఆశీర్వచనము అనంతరము ఆలయ కార్య నిర్వహణాధికారి వేంద్ర త్రినాధరావు స్వామి వారి జ్ఞాపకం ప్రసాదములను అందజేశారు వీరితో ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి తిరుమలేశ్వరరావు ,పర్యవేక్షణ అధికారి జీవిఎస్కే ప్రసాద్, పి ఆర్ ఓ నాయుడు తదితరులు ఉన్నారు.

కామ్రేడ్ పోతిన రాముకి సీపీఐ నివాళి

విశాలాంధ్ర-మల్కాపురం : కీర్తిశేషులు కామ్రేడ్ పోతిన రాముకి సిపిఐ పార్టీ నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. శనివారం మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ పోతిన సన్యాసిరావు రెండవ కుమారుడు అయిన పోతిన రాము పెద్దకర్మ స్థానిక మల్కాపురం నగరాల వీధిలో తన స్వగృహం నందు నిర్వహించగా ఈ కార్యక్రమానికి భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జీవీ సత్యనారాయణమూర్తి, విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్ర రావు, పౌర హక్కుల సంఘం రాష్ట్ర నాయకులు శ్రీరామ్‌మూర్తి, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు అత్తిలి విమల, సిపిఐ పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎస్.కె.రహిమాన్, సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ, పశ్చిమ నియోజకవర్గం సహాయ కార్యదర్శి గుడాల రాంబాబు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, సిబ్బంది



విశాలాంధ్ర-సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, "స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా ఈరోజు మూడవ శనివారం ఆలయ ప్రాంగణం మరియు సింహగిరి పరిసరాల్లో శుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ ఇంచార్జ్ కార్య నిర్వహణాధికారి వేంద్ర త్రినాధరావు ఆధ్వర్యంలో, సహాయ కార్యనిర్వహణాధికారి రమణమూర్తి, పంతం శ్రీనివాస్, ఆలయ సిబ్బంది భాగస్వామ్యంతో చేపట్టారు. రాజగోపురం ఎదురు ప్రాంగణం, నక్షత్రవనం, కొండపై బస్ స్టేషన్ పరిసరాల్లో శుభ్రత పనులు నిర్వహించారు. "స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ" కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఉద్యోగులందరితో కలిసి ప్రజలలో పరిశుభ్రతపై అవగాహన పెంచేలా ప్రమాణం చేయించారు.

గడ్డి మందు తాగి యువకుడు మృతి



విశాలాంధ్ర - అనందపురం : మండలం బంటుపల్లి గ్రామపంచాయతీ ఆకుల వారి కల్లాలు లో గొర్లె శంకర్రావు (28)అనే యువకుడు గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాల్లోకెళ్తే ఈనెల 14వ తేదీన గడ్డి మందు తాగడం వలన మారికవలస గాయత్రి హాస్పిటల్కు వైద్య నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. గతంలో కూడా మూడు నాలుగు సార్లు మందు తాగినట్లు చెబుతున్నారు. కృష్ణ దంపతులకు 4 గురు సంతానంలో ఇద్దరు కుమారులు 2 కుమార్తెలు శంకర్రావు చిన్న కుమారుడు వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండేవాడు. శంకరరావు మరణంతో ఆకుల వారి కల్లాలు లో విషాద ఛాయిలు అలుముకున్నాయి. తండ్రి కృష్ణ ఫిర్యాదు మేరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ చింతా వాసునాయుడు ఆధ్వర్యంలోకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

బోర్ వెల్ ప్రారంభం

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి : స్టాలిన్

విశాలాంధ్ర-గాజువాక : జీ.వి.ఎం.సి 72 వార్డు పరిధిలో మౌలిక సదుపాయాల కల్పన కు కృషి చేస్తున్నామని వార్డు కార్పొరేటర్ ఏ.జె.స్టాలిన్ అన్నారు. చినగంట్యాడ న్యూ ఎస్సీ కాలనీలో శనివారం జీవిఎంసి నిధులతో ఏర్పాటు చేసిన బోర్ వెల్‌ను స్టాలిన్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వార్డు పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద పీట వేశామని అన్నారు. రోడ్లు, డ్రైనేజీ, కమ్యూనిటీ హాల్స్, పార్క్‌ల అభివృద్ధికి కృషి చేశామని తెలిపారు. ప్రజలకు తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో బోర్ వెల్‌ను ప్రారంభించామని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు టీ.డీ.పి అధ్యక్ష, కార్యదర్శులు ఏ.లక్ష్మణ్‌రావు, సి.హెచ్. కన్నారావు, సీపీఐ కార్యదర్శి జి. ఆనంద్, అప్పారీ విష్ణుమూర్తి, వార్డు ప్రతినిధులు కొల్లి దేముడు, ఈశ్వర్‌రావు, మండే సత్యనారాయణ, రాజు, తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆంధ్రా ప్రీమియర్ లీగ్ జట్ల కోసం పోటీ పడిన ఫ్రాంచైజీలు

విశాలాంధ్ర-పీఎం పాలెం : ఈసారి ఏ పి ఎల్ సీజన్ -4 లో ఏడు జట్లు పాల్గొంటున్నాయి. ఐపీఎల్ మాదిరిగా రాడిసన్ బ్లూ లో నిర్వహించిన క్రికెట్ ఆటగాళ్ళ వేలంలో ఆల్ రౌండర్లు మంచి ధర పలికారు. ఈ వేలంలో సుమారు 520 మంది క్రీడాకారులు పాల్గొని తమ అదృష్టాన్ని పరీక్షించు కున్నారు. ఈసారి ఆటగాళ్ళ వేలం చాల ఆసక్తి కరంగా జరిగినది. అల్ రౌండర్లను దక్కించు కునేందుకు ఏడు ఫ్రాంచైజీలు గట్టి పోటీని ఇచ్చాయి. ఈసారి వేలంలో నచ్చిన ఆటగాళ్లను కొనుగోలు చేసేందుకు 1. రాయల్స్ ఆఫ్ రాయలసీమ -అక్షర ఎంటర్ ప్రైజెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, 2. భీమవరం బుల్స్ - మార్లిన్ గ్లోబల్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్, 3. సింహాద్రి వైజాగ్ లయన్స్ - స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, 4. తుంగభద్ర వారియర్స్ -విజేత సూపర్ మార్కెట్ ప్రైవేట్ లిమిటెడ్, 5. విజయవాడ సన్‌షైనర్స్ - మైత్రి మూవీ మేకర్స్, 6.కాకినాడ కింగ్స్ - ఆర్.కె.స్పోర్ట్స్ మరియు 7. అమరావతి రాయల్స్-అపర్ణా మెరైన్ ఎక్స్ పోర్ట్స్ వారు వేలంలో ఆటగాళ్లను దక్కించుకొనుటకు హెూరాహెూరీ పోటీ పడ్డారు. 10 నుంచి 12 లక్షలు వరకు వెచ్చించి వేలంలో క్రీడాకారులను స్వంతం చేసుకున్నారు. ఏపీఎల్ లో 7 వ టీమ్ రావడము వలన ఇంకొక 20 ప్లేయర్స్ కి అవకాశము వచ్చింది . వైజాగ్ లోని ఎ.సి.ఎ-వి.డి.సి.ఎ ఇంటర్ నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఆగస్టు 8వ తేదీ నుండి ఆగస్టు 24వ తేదీ వరకు ఏపీఎల్ సీజన్ -4 క్రికెట్ లీగ్ మ్యాచ్ లు నిర్వహించనున్నారు. ఈసారి ఏపిఎల్ అత్యంత ఉత్కంఠ భరితంగా జరుగుతుందని నిర్వాహకులు భావిస్తున్నారు. ఏపీఎల్ సీజన్ -4 కోసం క్రికెట్ అభిమానులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తు న్నారు. ఆగస్టు 1వ తేదీ నుండి అన్ని జట్ల కీడాకారులు నెట్ ప్రాక్టీసు చేయనున్నారని నిర్వాహకులు ఈ సందర్భంగా తెలియచేసారు. ఏపీఎల్ సీజన్-4 ఎడిషన్ ను అత్యంత ఉత్సాహంగా ప్రభావవంతమైన క్రీడగా నిర్వహించుటకు పూర్తి స్థాయిలో సన్నాహాలు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఔత్సాహిక క్రికెటర్లు రాణించుటకు ఇది కీలకమైన వేదిక అవ్వటమే కాక ఒక నూతన అధ్యాయానికి నాంది పలుకుతుందని, ఆంధ్రప్రదేశ్‌లో క్రికెట్ స్ఫూర్తికి ఇది నిదర్శనమని వారు తెలిపారు. క్రీడాకారుల కలలను సాకారం చేయుటకు, వారిని

ఛాంపియన్‌లుగా తయారుచేయుటకు ఆంధ్రా ప్రీమియర్ లీగ్ తోడ్పడుతుంది అన్నారు. ఏపీ ఎల్ సీజన్ -4 క్రీడాకారుల వేలం సందర్భంగా ఏసీఏ అధ్యక్షులు, ఎంపీ కేశినేని శివనాథ్, మాట్లాడుతూ క్రికెట్ అభిమానులు, ఫ్రాంచైజీలలో పెరుగుతున్న ఉత్సాహం ఆంధ్రా ప్రీమియర్ లీగ్ నకు ఎంతో స్ఫూర్తిని ఇస్తుంది అన్నారు. ఏసీఏ కార్యదర్శి సానా సతీష్ బాబు, మాట్లాడుతూ "ఆంధ్ర ప్రీమియర్ లీగ్ కుటుంబంలోకి నూతన ఫ్రాంచైజీలు రావటం ఎంతో సంతోషదాయకంగా ఉంది అన్నారు. ఆంధ్రా ప్రీమియర్ లీగ్ క్రికెట్ నూతన శకానికి నాంది పలికిందని, మా అభిరుచి , మా పురోగతిలో తమ వంతు సహకారం అందించి లీగ్ ను ప్రతిష్టాత్మకంగా రూపొందించుటకు మా ఫ్రాంచైజ్ జట్లను స్వాగతిస్తున్నామనీ చైర్మన్, పాలక మండలి, ఆంధ్రా ప్రీమియర్ లీగ్ సృజయ్ కృష్ణ రంగారావు తెలిపారు.

67వ వార్డులో పలు అభివృద్ధి పనులకు నగర మేయర్ శంకుస్థాపన

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : జీవీఎంసీ పరిధిలోని ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కలపనే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం అయిన జీవీఎంసీ 6వ జోన్ 67వ వార్డు పరిధిలోని జోగువారిపాలెం, గణేష్ నగర్, బొజ్జన్నకొండ, జీవి కాలనీ తదితర ప్రాంతాలలో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం విశాఖ నగర అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తుందని తెలిపారు. గాజువాక నియోజవర్గం అభివృద్ధిలో భాగంగా 67వ వార్డు నందు జీవీఎంసీ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు గాజువాక శాసనసభ్యులతో కలిసి శంకుస్థాపనలు చేశామన్నారు. 67వ వార్డు నందు తరచు మరమ్మతులకు గురవుతున్న పాత 100 ఎంఎం తాగునీటి పైపులైన్లను తొలగించి దాని స్థానంలో 110 ఎంఎం డయా గల హెచ్‌డిపి ఈ పైపులైన్లను సుమారు రూ.44.20 లక్షల వ్యయంతో వేసేందుకు శంకుస్థాపన చేశామన్నారు. అలాగే సుమారు రూ.308.42 లక్షల వ్యయంతో పలుచోట్ల వి ఆర్ సిసి కాలువలు, సిసి రోడ్లు, సిసి కాలువలు, సిసి కల్వర్టులు, సిసి మెట్లు, కాంపౌండ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపనలు చేశామన్నారు. అనంతరం గాజువాక శాసనసభ్యులు మాట్లాడుతూ విశాఖ అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని, గాజువాక పరిధిలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలతో పాటు ప్రజలకు అవసరమయ్యే మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. గాజువాకలో ప్రతి వార్డును ఆదర్శంగా తీసుకొని అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తామని శాసనసభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శేషాద్రి, జీవీఎంసీ కార్యనిర్వహక ఇంజనీరు, ఉప కార్యనిర్వాహక ఇంజనీరు, జీవీఎంసీ సిబ్బంది, పలువురు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ చార్జీల నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి : సీపీఐ

విశాలాంధ్ర-తగరపువలస : ఈరోజు తగరపువలస జి.ఆర్ భవన్ సిపిఐ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో భీమిలి ఏరియా కార్యదర్శి కానూరు రాంబాబు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు రద్దు కావాలని మరి అలాగే గతంలో ఎప్పుడో కాల్చిన కరెంటుకి ట్రూ ఆఫ్ చార్జీల పేరిట ప్రజలపై భారం మోపడం ఎంతవరకు కరెక్ట్ అని తెలుగుదేశం ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు నష్టం జరుగుతుందని ట్రూ ఆఫ్ చార్జీలు కూడా ఉపసంహరించుకోవాలని రాష్ట్ర పార్టీ కార్యదర్శి రామకృష్ణ ఈనెల 19వ తారీకు నుండి ఆగస్టు 5 వరకు పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టాలని ప్రజలకు తెలియజేసి చైతన్య పరిచి ఈ స్మార్ట్ మేటర్ వల్ల ఎంత నష్టం జరుగుతున్నదని వివరించవలసిందిగా వామపక్ష పార్టీలు ప్రజా

సంఘాలు అందరినీ కలుపుకొని మరొక విద్యుత్ పోరాటం చేయాలని పిలుపునిచారని తెలిపారు. ఈ సమావేశంలో ఏరియా సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు మాట్లాడుతూ గతంలో చంద్రబాబు నాయుడు లోకేష్ బాబు స్మార్ట్ మీటర్లు పెట్టడం వల్ల ప్రజలకు చాలా నష్టం అని స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టిండని అనేక మీటింగ్లో ఉపన్యాసాలు ఇవ్వడం జరిగింది మరి ఇప్పుడు వారి తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వచ్చింది వారే స్మార్ట్ మీటర్లని బిగించమని చెబుతున్నారు. వారే స్మార్ట్ మీటర్లు బిగించడానికి ట్రూ ఆఫ్ చార్జీలు ప్రజలపై 15,485 వేల కోట్లు ప్రజలపై భారం వెయ్యటానికి చూస్తున్నారు ఎంత విడ్డూరంగా ఉందో మరి ప్రజలే గమనించాలని గత జగన్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేటట్టుగా ఈ ప్రభుత్వానికి కూడా వెనక తగ్గకపోతే అదే పరిస్థితి వస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా కౌన్సిల్ సభ్యులు పార్టీ సభ్యులు వీర్రాజు లక్ష్మణరావు ముత్యాలరావు రాము తోటయ్య ఆదినారాయణ మొదలగు కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాఖలో చదరంగం క్రీడకు మంచి ప్రాచుర్యం కల్పిస్తున్నాం

చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ బాబురావు

విశాలాంధ్ర-పెందుర్తి : విశాఖలో చదరంగం క్రీడకు మంచి ప్రాచుర్యం కల్పిస్తున్నట్లు ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ రంగాల బాబురావు తెలిపారు. ఇంటర్నేషనల్ చెస్ డే సందర్భంగా ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సుమారు 1500 సంవత్సరాల క్రితం 6వ శతాబ్దంలో గుప్త రాజవంశం కాలంలో భారతదేశంలోనే చదరంగం క్రీడ ఆవిర్భవించిందని అప్పట్లో చతురంగ అని పిలిచేవారని తెలిపారు. చతురంగ అంటే సైన్యంలోని పదాతిదళం, అశ్విక దళం, ఏనుగులు రథాలు అని పేర్కొన్నారు. అనంతర కాలంలో భారతదేశం నుండి పర్షియాకు వ్యాపించగా, అక్కడ చదరంగాన్ని శత్రుంజ అని పిలిచేవారన్నారు. అక్కడి నుండి స్పెయిన్ ఇటలీ ద్వారా ఐరోపాకు విస్తరించి, ఆటలో నియమాలు మార్పులు జరిగి ఇప్పుడు చదరంగంగా భారతదేశంలో ప్రాచుర్యం పొందిందని తెలిపారు. విశ్వనాథ ఆనంద్ నుండి గూకేష్ వరకు ఆటగాళ్ల భారతదేశాన్ని ప్రపంచ ఛాంపియన్ గా నిలబెట్టారని వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా చెస్ ఆన్ లైన్ అండ్ ఆఫ్ లైనులో టోర్నమెంట్లు జరుగుతున్నాయని చెప్పారు. విశాఖలో చెస్ అబివృద్దికి ప్రెసిడెంట్ గా ఎంతో కృషి చేస్తున్నానని, ఆంధ్ర చెస్ అసోసియేషన్ అనుమతితో అన్ని గ్రూపులను

కలిపి అధికారికంగా ఓపెన్ చెస్ టోర్నమెంట్ టైం టు టైం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టోర్న మెంట్స్ ఎక్కువగా నిర్వహిస్తుండటంతో క్రీడాకారులకు ఆటపై ఆసక్తి పెరిగి ఎక్కువమంది చదరంగాన్ని ఆడుతున్నారని చెప్పారు. ఇప్పుడు ప్రతి స్కూల్లోను చెస్ ఒక భాగంగా ఉందని, ఒకప్పుడు కేవలం నాలుగు ఐదు చెస్ అకాడమీలు ఉండేవని, ఇప్పుడు వైజాగ్ లో సుమారు 35 చెస్ అకాడమీలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం ప్రతి టోర్నమెంట్ లోను కనీసం 250 నుండి 300 ప్లేయర్స్ ఆడుతున్నారని, ఇది ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ హార్డ్ వర్క్ కు నిదర్శనం అన్నారు. శ్రీ చెస్ అకాడమీ, చైతన్య చెస్ అకాడమీ, క్యాండిడ్ నైట్స్ చెస్ అకాడమీ, ఆదిత్య చెస్ అకాడమీ, ఆచార్య చెస్ అకాడమీ, మైండ్ మాస్టర్స్ చెస్ అకాడమీలతో కలిసి చదరంగాన్ని విశాఖలో అభివృద్ధి చేస్తున్నట్లు తెలియజేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : ఎమ్మెల్యే గంటా

విశాలాంధ్ర-తగరపువలస : భీమిలి మండలం తాటితూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో శనివారం జరిగిన స్వచ్ఛ ఆంధ్రలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవడం ద్వారా భవిష్యత్ తరాలలో మార్పు వస్తుందని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు అధికారులు బాధ్యత తీసుకోవాలని ఆయన సూచించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై తాటితూరు హైస్కూల్ విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు గంటా బహుమతి ప్రదానం చేశారు. స్వచ్ఛ ఆంధ్ర సందర్భంగా ప్లాస్టిక్ నిషేధంపై బాధ్యత తీసుకుని పర్యావరణాన్ని రక్షిస్తామని,పరిసరాల పరిశుభ్రతకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం తాటితూరు కాజ్ వే పనులను పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గాడు వెంకటప్పడు, జిల్లా పంచాయతీ అధికారి ఎం.శ్రీనివాసరావు, డి.ఎల్.పి.ఓ. సిహెచ్. నిర్మలాదేవి, ఎం.పి.డి.ఓ. కె.వి.నరసింహారావు, డిప్యూటీ ఎం.పి.డి.ఓ. కె.రమేష్ నాయుడు, ఎమ్మార్వో బి.రామారావు తదితరులు పాల్గొన్నారు.



సుపరిపాలన ప్రచారంలో గంటా... సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం తాటితూరు గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను.. చేపడుతున్న అభివృద్ధి పనులను కరపత్రాలు అందజేసి వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సరగడ అప్పారావు, వై.అనిల్ ప్రసాద్, గొలగాని నరేంద్ర, తాత్రాజు అప్పారావు, బి.ఆర్.బి. నాయుడు, కోరాడ రమణ, దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదానికి గురైన ఐటీసీ గోడౌన్‌ను చిన్న శ్రీను సందర్శన

విశాలాంధ్ర-అనందపురం : మండలం గండిగుండం పంచాయతీ పరిధిలో ఉన్న ఐటీసీ గోడౌన్‌లో శనివారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. లక్షల్లో ఆస్తినష్టం సంభవించినట్లు ప్రాథమికంగా అంచనా వేయబడింది. ప్రమాద సమాచారాన్ని తెలుసుకున్న విజయనగరం జిల్లా జడ్పీ చైర్మన్, వైస్సార్సీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆయన బాధితులను ఓదార్చి, అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆనందపురం ఎంపీపీ ప్రతినిధి మజ్జి వెంకటరావు, గండిగుండం సర్పంచ్ శ్రీను, లెంక రాంబాబు పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి కార్మికులకు బకాయి పడ్డ జీతాలు వెంటనే చెల్లించాలి

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ



విశాలాంధ్ర-పెందుర్తి : జిల్లాలో పెందుర్తి, అగనంపూడి, భీమిలి, గోపాలపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ గార్డులు, పెస్ట్ కంట్రోల్ కార్మికులకు బకాయి పడ్డ జీతాలు తక్షణమే చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాలరమణ డిమాండ్ చేశారు. శనివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ శానిటేషన్ కాంట్రాక్ట్ కార్మికుల పిఎఫ్ డబ్బులు చెల్లించకుండా కార్మికుల శ్రమను దోచుకుంటున్న కాంట్రాక్టర్లను, బ్లాక్ లిస్టులో పెట్టాలని అధికారులను కోరారు. ప్రభుత్వ ఆసుపత్రులలో శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ తదితర విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు ప్రాణాలు పణంగా పెట్టి ప్రజలకు సేవలు అందిస్తున్నారని, వారి ఆరోగ్యానికి రక్షణ లేదని చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తూ దుర్భర జీవితం గడుపుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. కూటమి ప్రభుత్వం కాంట్రాక్టర్ల కోరల్లో చిక్కుకున్న కార్మికులను నిలువ దోపిడీ నుండి కాపాడి విముక్తి కలిగించే విధంగా చర్యలు చేపట్టి కాంట్రాక్ట్ కార్మికులు అందరిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిసిహెచ్ శంకర్ ప్రసాద్ ను కలిసి సమస్యలు వివరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోన లక్ష్మణ, ఆకుల భవాని, నమ్మి లక్ష్మి, సీతమ్మ, లక్ష్మి, నూక రాజు, తాతారావు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనకు అందరూ సహకరించాలి : ఎమ్మెల్యే గంటా

విశాలాంధ్ర-ఆనందపురం : పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా ప్లాస్టిక్ లేని సమాజాన్ని స్థాపించాలని ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ వాడకుండా నిర్మూలించాలని అప్పుడే పర్యావరణం బాగుపడుతుందని తెలిపారు. శనివారం అనందపురం మండలం బంటుపల్లి గ్రామపంచాయతీ పరిధిలో రామాలయం వద్ద శాసనసభ్యులు ఘంటా శ్రీనివాసరావు ప్లాస్టిక్ అవేర్నెస్ డే సందర్భంగా రామాలయం వద్ద మొక్కలు నాటారు. గ్రామాలే పట్టుకొమ్మలు ప్రతి ఒక్కరు గ్రామాలను పరిశుభ్రంగా చూసుకోవాలని తెలిపారు. అనంతరం సానిటైజేషన్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో, పిఓపిఆర్డి సత్యనారాయణ స్థానికకార్యదర్శి షేక్ షమ్ము, సర్పంచ్ కోన పైడిరాజు మండల పార్టీ ప్రెసిడెంట్ తాత్రాజు అప్పారావు, బంటుపల్లి శ్రీనివాసరావు, బి.ఆర్.బి.నాయుడు, వరప్రసాద్, లోడగల వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



విశాలాంధ్ర-సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి నిత్యాన్న ప్రసాద పథకానికి విజినిగిరిపాలెం, సింహాచలంకు చెందిన పాలకొల్లు లక్ష్మీనారాయణ మనోరథ్, నగదు రూపంలో రూ.1,00,000/-లు విరాళంగా సీనియర్ సహాయకులు సూర్యనారాయణకు అందజేశారు. ఆలయ మర్యాదలు ప్రకారం దాతకు స్వామివారి ప్రత్యేక దర్శనం, వేద ఆశీర్వచనం చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామివారికి భక్తులు, దాతలు ఏమైనా వస్తువులు, ధన, చెక్కు , డిడి రూపేణా విరాళం ఇచ్చిన సంబంధిత అధికారి వద్ద తగు రసీదు పొందాలని లేదంటే వారు ఇచ్చిన విరాళాలు స్వామివారికి చెందవు అని అధికారులు తెలిపారు. దాతలకు ఎటువంటి సమాచారం కావాలన్నా 9491000635 నెంబర్ కు సంప్రదించవచ్చు లేదంటే నేరుగా మమ్మల్ని అంటే దేవస్థానం కార్యనిర్వహణాధికారి వారిని సంప్రదించగలరు అని ఇంచార్జ్ ఈఓ త్రినాధరావు తెలిపారు.

ఆర్సెలర్ మిట్టల్ అండ్ నిప్పాన్ స్టీల్స్ (ప్రై)లిమిటెడ్ (సిఎస్ఆర్) చొరవ

పోలీసులకు 25 హోండా షైన్ వాహనాలు అందజేత



విశాలాంధ్ర-విశాఖ క్రైమ్ : కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా (సిఎస్ఆర్) 25 అధునాతన మోటార్ సైకిళ్ళను (హెూండా షైన్ 125 సిసి) విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ చేతుల మీదుగా విశాఖ నగర పోలీసు విభాగానికి అందజేసింది. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ, ఈచొరవ సమాజానికి కంపెనీ నిబద్ధతను తెలియజేస్తుందనీ, పోలీసు బలగాలను బలోపేతం చేయడంలో సహాయపడుతుందనీ తద్వారా వారు మెరుగైన సేవలను అందించడంలోనూ మరియు పోలీసుల దైనందిన కార్యకలాపాలకు, ముఖ్యంగా పెట్రోలింగ్ మరియు త్వరిత ప్రతిస్పందన సమయాలకు ఎంతో ఉపయోగపడతాయనీ. ఇదే విధంగా 2024 సంవత్సరంలో ఆర్సెలర్ మిట్టల్ అండ్ నిప్పాన్ స్టీల్స్ (ప్రైవేట్) లిమిటెడ్ వారు 32 మోటార్ సైకిళ్ళ ను విశాఖ నగర పోలీస్ వారికి అందజేశారని, ఈ విరాళం సమాజ భద్రత మరియు శాంతిభద్రతల పరిరక్షణకు గణనీయమైన తోడ్పాటును అందిస్తుందనీ విశాఖ నగర పోలీసుల తరపున పోలీసు కమీషనర్ వారికి ధన్యవాదములు తెలియజేశారు.

సాధారణ బదిలీలలో ఐదుగురు డీఎస్పీలకు స్థానచలనం

విశాఖ క్రైం ఏసీపీగా కే.ధర్మేంద్రకి పోస్టింగ్

ప్రస్తుత క్రైం ఏసీపీ డి.లక్ష్మణరావు కు టెక్కలి డీఎస్పీగా బదిలీ

విశాలాంధ్ర-విశాఖ క్రైమ్: ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖలో సాధారణ బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా . ప్రస్తుత విశాఖ క్రైం ఏసీపీ డి.లక్ష్మణరావు కు టెక్కలి డి.ఎస్.పి గా, విశాఖ క్రైం ఏసీపీ గా కే. ధర్మేంద్ర కి స్థాన చలనం కలిగించారు, పరిపాలనా సౌలభ్యం, వివిధ జిల్లాల్లో అవసరాల మేరకు ఈ బదిలీలు జరిగినట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

ఆనందపురంలో అగ్నిప్రమాదం

- ఐటీసీ స్టాక్ కంపెనీలో భారీ ప్రమాదం...

- వివరాలు సేకరిస్తున్న అధికారులు



విశాలాంధ్ర-ఆనందపురం : మండలం గండిగుండం ఐటిసి స్టాక్ కంపెనీలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. కోట్లలో ఆస్తినష్టం జరిగిందని సమాచారం. గండిగుండం-రామవరం రోడ్డులో అర్ధరాత్రి జరిగిన అగ్రి ప్రమాదంతో గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. రామవరం-గండిగుండం రోడ్డులో ఉన్న ప్రముఖ ఐటిసి స్టాక్ కంపెనీలో శుక్రవారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం సంభవించింది. రాత్రి 11:45 గంటల సమయంలో మొదలైన మంటలు కంపెనీ అంతటా వ్యాపించి భారీ నష్టం కలిగించాయి. ఇప్పటివరకు లభిస్తున్న సమాచారం మేరకు సుమారు కోట్ల లో విలువైన ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. కానీ భారీ ఆస్తి నష్టం జరిగిందని కంపెనీ యజమానులు వాపోతున్నారు. ఈఘోర అగ్నిప్రమాదాన్ని అదుపు చేయడానికి విజయనగరం, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల నుండి వచ్చిన 8అగ్నిమాపక శకటాలు ముమ్మరంగా అర్ధరాత్రి నుండి ఉదయానికి మంటలు అదుపు చేశారు. అగ్నిమాపక రీజనల్ డైరెక్టర్ నిరంజన్ రెడ్డి, డీఎఫ్ రేణుక, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరాజు, రమేష్

చక్రవర్తి, శంకర్, రవి, సబ్బవరం ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక పోలీసులు సీఐ వాసునాయుడు, ఎస్ఐ సంతోష్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు అందించారు. కంపెనీలో ఉప్పు, గోధుమలు, చాక్లెట్లు, సిగరెట్లు, అగరబత్తీలు వంటి నిత్యావసర వస్తువులు నిల్వ ఉంచి ఒడిశా తో పాటు ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తుండగా, మంటలు వీటన్నింటినీ నాశనం చేసినట్లు తెలుస్తోంది. ఈ కంపెనీని కలకత్తా వాసి బాబీ ఘోష్ సహా మరికొంతమంది నిర్వహిస్తున్నట్లు సమాచారం. అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. సంఘటనపై పూర్తి వివరాలు రావాల్సి ఉంది. అయితే భారీ పరిశ్రమ కాబట్టి ఎవరైనా కక్షపూరితంగా చేశారా లేదా షార్ట్ సర్క్యూట్ వలన ప్రమాదం జరిగిందా వివరాలు ఇంకా పూర్తిగా తెలియాల్సి ఉంది అదృష్టవశాత్తు ఎవరికి ప్రాణ నష్టం జరగలేదు. అయితే కంపెనీలో ఎక్కువ మొత్తంలో నిత్యవసర సరుకులు నిల్వలు అధికంగా ఉండడంతో భారీ సంఖ్యలో ఆస్తి నష్టం జరగవచ్చు అని తెలుస్తుంది.

నారా భువనేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిసిన మేయర్ పీలా శ్రీనివాసరావు

విశాలాంధ్ర-విశాఖపట్నం : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి ఆర్కే బీచ్ లో ఎన్టీఆర్ ట్రస్ట్ ఏర్పాటు చేసిన తల సేమియా రన్ 2కె, 3కె, 5కె కార్యక్రమానికి విశాఖ పట్నం విచ్చేసిన సందర్భంగా విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు ఆమెను కరణం మల్లేశ్వరితో కలిసి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు.

నగర మేయర్‌ను అభినందించిన స్థాయి సంఘం సభ్యులు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : స్వచ్ఛ సర్వేక్షన్ 2024 కు గానూ మహా విశాఖపట్నం నగర పాలక సంస్థకు సఫాయిమిత్ర సురక్షిత్ షహర్ ప్రత్యేక కేటగిరీలో ప్రథమ స్థానం పురస్కారాన్ని అందుకున్న నగర మేయర్ పీలా శ్రీనివాసరావును జీవీఎంసీ స్థాయి సభ్యులు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం అభినందించారు.

విశాఖ నగరంలో ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు పలుకుదాం

- విశాఖ నగరాన్ని స్వచ్ఛంగా తీర్చిదిద్ది స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర అభివృద్ధికి సహకరిద్దాం
- విశాఖ జిల్లా కలెక్టర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : విశాఖ నగరంలో ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు పలకాలనే నేపథ్యంతో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల్లో పాల్గొని,విశాఖ నగరం నుండి ప్లాస్టిక్ వస్తువులను పారద్రోలి, ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు పలకాలని, పర్యావరణహితమైన ప్రత్యామ్నాయ వస్తువులనే వినియోగిస్తూ విశాఖ నగర పర్యావరణ పరిరక్షణకు ప్రజలందరూ కృషి చేయాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఆయన 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, జీవీఎంసీ అదనపు కమిషనర్లు డి.వి.రమణమూర్తి, ఎస్.ఎస్. వర్మలతో కలిసి జోన్-2, ఎండాడ జంక్షన్ వద్ద ఆర్ఆర్ఆర్ సెంటర్ లో జీవీఎంసీ ఏర్పాటుచేసిన స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా కలెక్టర్ ఎం ఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల 3వ శనివారం ఒక అవగాహన కార్యక్రమం నేపథ్యంతో రాష్ట్రమంతటా స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని స్వర్ణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతోందని అన్నారు. ఆ దిశగా విశాఖ నగరంలో ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు పలుకుతూ ఈ నగరం నుండి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను తరిమికొట్టి, పర్యావరణ హితమైన ప్రత్యామ్నాయ వస్తువులనే వినియోగించాలనే ఈ నేపద్య కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో భాగస్వామ్యమవ్వాలన్నారు. మనం రోజు వినియోగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు కాలువలలో, గెడ్డలలో చేరి వర్షాలు సమయంలో పొంగిపొర్లి వ్యాధులకు కారణమవుతున్నాయన్నారు. పారిశుద్ధ్య కార్మికులు ప్రాణాలను పణంగా పెట్టి గెడ్డలలో ప్లాస్టిక్ వ్యర్థాలను నిత్యం వెలికి తీస్తున్నారన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలో చేరడం వలన ఆహారంగా తింటున్న చేపలను మనం వినియోగించడం వలన క్యాన్సర్ వ్యాధులకు గురవుతూ ప్రాణాలకు ముప్పు కలిగించుకుంటున్నామన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా ప్రత్యామ్నాయ వస్తువులైన పేపర్, వస్త్ర, నార సంచులు, స్టీలు, గ్లాసు, పింగాణి గిన్నెలు, కప్పులు, డబ్బాలు, వాటర్ బాటిళ్ళు మొదలగు పర్యావరణహితమైన వస్తువులను వినియోగించాలని, మన చిన్న అలవాట్లతో ఒక పెద్ద మార్పు నాందికి ప్రజలందరూ అవగాహనతో ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి పలకాలని, పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తూ స్వర్ణాంధ్ర అభివృద్ధి దిశగా స్వచ్ఛ విశాఖ కు సహకరించాలని ప్రజలకు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అనంతరం 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువుల వినియోగం వలన ఈ భూమికి హాని, నష్టం కలుగుతుందని, ప్రజలు అవగాహనతో విశాఖ నగర పర్యావరణ పరిరక్షణ దిశగా ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలని అందుకు ప్రజలందరూ సహకరించా లన్నారు. అనంతరం అదనపు కమిషనర్ డి.వి.రమణ మూర్తి మాట్లాడుతూ 2027వ సంవత్సరానికి స్వర్ణాంధ్ర సాధనకు అభివృద్ధి దిశగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దాలని, ప్రకృతి, పర్యావరణ సమతుల్యతతో విశాఖ నగర అభివృద్ధి సాధన లక్ష్యంగా ప్రజలు అవగాహనతో ఈ విశాఖ నగరం నుండి ప్లాస్టిక్ వస్తువులను పారద్రోలి, ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు పలకాలన్నారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈఎన్వి నరేష్ కుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువుల వినియోగానికి బదులుగా విశాఖ నగరంలో ప్రత్యామ్నాయ వస్తువులను జీవీఎంసీ అందుబాటు లోకి తీసుకు వచ్చిందని ప్రజలు అందరూ పర్యావరణహితమైన వస్తువులనే వినియోగించాలని తెలిపారు. అనంతరం విశాఖ జిల్లా కలెక్టర్ ఈ కార్యక్రమానికి హాజరైన వారందరితో కలసి అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ చే "స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ"ను చేయించి, "లెట్స్ ఎండ్ ప్లాస్టిక్ పొల్యూషన్ టుగెదర్" అనే సమాచారంతో కూడిన అవగాహన పోస్టర్ ను విడుదల చేశారు. విశాఖ నగరానికి జాతీయస్థాయిలో సఫాయిమిత్ర సురక్షిత్ శెహర్ ప్రత్యేక కేటగిరీలో ప్రథమ స్థానం సాధనకు కృషిచేసిన పారిశుద్ధ్య కార్మికుల్లో పలువురు పారిశుద్ధ్య కార్మికులను, పలువురు ఎన్జీవో సంస్థల ప్రతినిధులను ఈ కార్య క్రమంలో సత్కరించి వారిని కలెక్టర్ అభినందించారు. అనంతరం కార్య క్రమం ప్రాంగణంలో పర్యావరణ హితమైన వస్తువులకు సంబం ధించిన ఏర్పాటుచేసిన పలు స్టాళ్లను కలెక్టర్ సందర్శించి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో యు సి డి ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.ఎం సత్యవేణి,జోనల్ కమిషనర్లు ఇప్పి నాయుడు, కె.కనకమహాలక్ష్మి, సహాయక వైద్యాధికారి డాక్టర్ ఎన్ .కిషోర్ కుమార్, స్వచ్ఛంద సంస్థలు, టిడిపి జనసేన పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి : జీవీఎంసీ 95వ వార్డు ఎన్ఎడి లే అవుట్‌లో శనివారం నిర్వహించిన స్వచ్ఛఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పెందుర్తి బిజెపి నాయకులు, స్థానిక కార్పొరేటర్ ముమ్మన దేముడు పాల్గొన్నారు. పరిసరాల పరిశుభ్రత, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించారు. స్వచ్ఛ కార్మికులు, స్థానిక ప్రజలతో స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులతో కలిసి కార్పొరేటర్ ముమ్మన పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికు శ్రీకారం చుట్టిందని,ప్రతి ఒక్కరు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కిరాణా షాప్స్, మాంసం, చేపలదుకాణాలు, ఇతర వ్యాపారం చేసే వారందరూ ప్లాస్టిక్ కవర్లు బదులుగా గుడ్డ, నార సంచులను మాత్రమే వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అత్తిలి నాగేంద్ర కుమార్, సన్యాసిరావు, పాపారావు, 95వ వార్డు ఇంచార్జ్ శానిటేషన్ ఇన్స్పెక్టర్ లాజర్, శానిటేషన్ సెక్రటరీలు, ఆర్.పి మహిళలు,శానిటేషన్ సూపర్వైజర్లు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

పెందుర్తి : జీవీఎంసీ 97వ వార్డు చిన్నముషిడివాడ పరిధిలోగల సుజాతనగర్ మెయిన్ రోడ్లో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం శనివారం ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సేనాపతి వసంత శంకర్రావు ముఖ్య అతిథిగా పాల్గొని స్వచ్ఛ దివస్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, ప్లాస్టిక్ నిర్మూలన, అందరి బాధ్యత కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్పెక్టర్ రమేష్, సిఓ, ఆర్పీలు, శానిటేషన్ డిపార్ట్మెంట్ వర్కర్స్, సూపర్వైజర్స్ పాల్గొన్నారు.

తగరపువలస : స్థానిక ఎస్వీఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వర్ణాంధ్ర స్వచ్ఛఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కృష్ణమూర్తి పాల్గొని ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరించి ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమానికి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ అధ్యాపక బృందం, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇండియన్ ఫ్యాషన్ ఎగ్జిబిషన్ సూత్ర ప్రారంభం

విశాలాంధ్ర-విశాఖపట్నం : నగరంలోని బీచ్ రోడ్ దరి నోవాటేల్ హెూటల్ నందు ఇండియన్ ఫ్యాషన్ ఎగ్జిబిషన్ సూత్ర శ్రావణ, రాఖీ సందర్భంగా ప్రత్యేక వస్త్ర ప్రదర్శన శనివారం ప్రారంభించారు. జూలై 19 20 తేదీలలో ఈ ప్రదర్శన ఉదయం 10 గంటల నుండి రాత్రి 9గంటలు వరకు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ప్రవేశం ఉచితం అని, ఈ ప్రదర్శనలో షాపింగ్ చేయటం ఒక మరపురాని అనుభూతిని కలిగిస్తుందని చెప్పారు. అద్భుతమైన విశిష్ట వస్త్రాల సమ్మిళితమైన సూత్ర ప్రదర్శన ప్రసిద్ధి చెందినదన్నారు. భారతదేశం లోని ప్రముఖ ప్రీమియం బ్రాండ్ల ఎగ్జిబిషన్. సంప్రదాయతలో అత్యున్నత ఫ్యాషన్ లను మిళితం చేసిన చేనేతలు సూత్ర ప్రత్యేకం అన్నారు. దేశ వ్యాప్తంగా నున్న 50 పైగా ప్రముఖ ఎగ్జిబిటర్లు తమ ఉత్తమ శ్రేణి ఉత్పత్తులను, ఉపకరణాలు, గిఫ్ట్ ఆర్టికల్స్ అన్నింటిని ఒకేచోట ఈ ప్రదర్శనలో అందిస్తారన్నారు. పండుగలు శుభ కార్యాల కోసం వస్త్రాలు, సౌందర్య సాధనాలు మరియు అద్భుతమైన కానుకలు కోసం చూస్తుంటే అవన్నీ సూత్రాలో లభిస్తాయని అన్నారు. సూత్రా ప్రదర్శనలో ఇంపీరియల్ తారా, ఆర్ లక్ష హ్యామ్పార్, లేబుల్ ఇషానా, ఊష్వీ, రాజ్ రూపికాస్, క్రియాన్ ఫ్యాషన్స్ మొదలైన వారు పాల్గొన్నారు. సాంప్రదాయ వస్త్రాలు తోపాటు ఆధునిక శైలి వరకు అద్భుతమైన వస్త్రాలు, హేండ్ క్రాఫ్ట్ ఆభరణములు, లేహంగాలు, ఇండి-వెస్ట్రన్ ఫ్యాషన్లు, ఎత్నిక్ ఫుట్ వేర్, లగ్జరీ గిఫ్ట్ అయిటంలు మొదలైనవి అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

సమాచార శాఖ కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో శనివారం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాలు చేపట్టారు. ఉప సంచాలకులు కె. సదారావు, సహాయ సంచాలకులు డి.రమేష్ సారథ్యంలో అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పరిశుభ్రతా చర్యలు చేపట్టారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను తొలగించారు. పనికిరాని పాత వస్తువులను ప్రత్యేక ప్రాంతానికి చేర్చి భద్రపరిచారు. కార్యాలయ ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించి బ్లీచింగ్ చల్లారు. దోమలు వ్యాప్తి చెందకుండా, అపరిశుభ్ర వాతావరణం లేకుండా మందులను పిచికారీ చేశారు. తుప్పు పట్టిన ఇనుప వస్తువులను తొలగించారు. విద్యుత్ పరికరాలకు మరమ్మతులు చేపట్టారు. వేలాడుతున్న విద్యుత్ తీగలను తొలగించి కొత్తవాటిని అమర్చారు. డీడీ కార్యాలయంలో, ఎస్.ఐ.సి. ఏడీ కార్యాలయంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వస్తువులను తొలగించి శుభ్రతా చర్యలు చేపట్టారు. అధికారులు, సిబ్బంది ఒకచోట చేరి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులకు స్వస్తి పలుకుదామని పేర్కొంటూ సామూహిక ప్రతిజ్ఞ చేశారు. డివిజనల్ పీఆర్వో నారాయణరావు, ఏపీఆర్వో శ్రీనివాసరావు, ఏవీఎస్ వెంకటరావు, ఇతర ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ప్రజా పరిషత్‌లో ప్లాస్టిక్ నిషేధం

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం జిల్లా ప్రజా పరిషత్‌లో ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తూ పర్యావరణాన్ని కాపాడాలని జడ్పీ ఉప సిఈఓ కె.రాజ్‌కుమార్ అన్నారు. పర్యావరణ హితమైన నార, గుడ్డ సంచుల వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా ప్రజా పరిషత్ ఆధ్వర్యంలో ఈరోజు స్వచ్ఛాంధ్ర -స్వర్ణాంధ్ర కార్యక్రమము నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి కె. రాజ్ కుమార్ సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి మాట్లాడుతూ, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని, పర్యావరణ పరిరక్షణకు నార మరియు గుడ్డ సంచులను విరివిగా ఉపయోగించాలని సూచించారు. ఎ.పి.పి.ఆర్.ఇ.యం.ఎ. అధ్యక్షులు యస్. సత్తిబాబు మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధం భవిష్యత్ తరాలకు ఆరోగ్య ప్రదాయకమని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజాపరిషత్, పంచాయితీ రాజ్ శాఖ, మరియు ఆర్. డబ్ల్యూఎస్ సిబ్బంది సమిష్టిగా పాల్గొని ప్రజలకు ప్లాస్టిక్ వల్ల కలిగే దుష్పరిణామాలపై మరియు పర్యావరణ హితమైన ప్రత్యామ్నాయ వినియోగంపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ నిషేధంపై నినాదాలు చేస్తూ, జిల్లా ప్రజా పరిషత్ కూడలి నుండి జిల్లా పరిషత్ జంక్షన్ వరకు మానవహారంగా ఏర్పడి స్లోగన్స్ వినిపించారు. ఈకార్యక్రమంలో పరిపాలనాధికారులు డి.మంజువాని, శ్రీ పి.వి.వి.యన్.మూర్తి, వి.ఆర్.ఆర్. రాజేశ్వరి, పి.వి.వి.సతీస్, యం.వి. నర్సింహమూర్తి, కె.యన్. రంగా, మరియు జిల్లా పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రూప్ హౌస్‌లో వ్యర్థాలను నిల్వచేస్తూ అమ్మకాలు

విశాలాంధ్ర-విశాఖపట్నం: నగరంలోని 22వ వార్డు పరిధి స్థానిక శివాజీపాలెం ఆరు కుళాయిల జంక్షన్ వద్ద 9-6-4 డోర్ నెంబర్ పైన గల గ్రూప్ హౌస్ లో గత కొంతకాలంగా అద్దెకు ఉంటున్న పైలా.కృష్ణ వేణి అనే మహిళ, ఆమె తల్లి రోడ్లపైన , చెత్త కుండీలు వద్ద అమ్ముకోడానికి వీలుగా వుండే వ్యర్థాలను సేకరించి గ్రూప్ హౌస్ లో నిల్వవుంచుతూ వాటిని అమ్మకాలు చేయడం జరుగుతుందని పరిసర ప్రాంతాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో వ్యర్థాల కారణంగా వెలువడే దుర్వాసన,దోమల వలన మిగతా ప్లాటులలో నివాసం ఉంటున్న వ్యక్తులు మరియు చుట్టుపక్కల వాలు అనారోగ్యంకు గురి అవుతుండటం అదేవిధంగా వ్యర్థాల నిల్వ వలన తేళ్లు, అనేక పురుగులు వచ్చి చేరుతుండటం జరుగుతుందని వాపోయారు. ఈ విషయమై మిగతా ప్లాటులలో నివాసం ఉంటున్న వ్యక్తులు పైలా.కృష్ణ వేణి అనే మహిళా అద్దెకు ఉంటున్న ప్లాటు యజమాని దృష్టికి సైతం ఈ సమస్యను తీసుకు వెళ్లడం జరిగింది. అయినప్పటికీ ఎటువంటి ఫలితం లేదని అక్కడి వారు అంటున్నారు. ఇది చాలదు అన్నట్లు సదరు మహిళా ప్రశ్నించిన మిగతా ప్లాటుల వారితో తరుచు తగాదాలు పడటం, అసభ్య పదజాలంతో వారిని దూషించడం, మీపై కేసులు పెడతాను అంటూ బెదిరింపులకు దిగడం తో సదరు మహిళా తీరుతో స్థానికులు అసహనం వ్యక్తం వ్యక్తం చేస్తున్నారు. జివిఎంసి అధికారులు మరియు సంబంధిత అధికారులు ఈ మహిళపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ అంశంపై ఇప్పటికీ పోలీసులకు ఫిర్యాదు చేశామని, జీవీఎంసీ జోన్ 3 కార్యాలయ అధికారులు కూడా ఫిర్యాదు చేసినట్లు వారు చెప్పారు.

సుమారు రూ.31.03 కోట్ల అభివృద్ధి పనులకు స్థాయి సంఘం ఆమోదం

-నగర మేయర్, స్థాయి సంఘం చైర్‌పర్సన్ పీలా శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ స్థాయి సంఘం సమావేశంలో అన్ని అంశాలు ఆమోదింపబడ్డాయని నగర్ మేయర్, స్థాయి సంఘం చైర్పర్సన్ పీలా శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో స్థాయి సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థాయి సంఘం చైర్పర్సన్ మాట్లాడుతూ స్థాయి సంఘం సమావేశంలో 60 ప్రధాన అజెండా అంశాలతో పాటు 33 టేబుల్ అజెండా అంశాలతో కలిపి మొత్తం 93 అంశాలను పొందుపరచడం జరిగిందని, వాటిని స్థాయి సంఘం సభ్యులు చర్చించి అన్ని అంశాలను ఆమోదించారని తెలిపారు. రెవెన్యూ విభాగం నకు సంబంధించి ఆశీలు వసూలు, అద్దెలు పొడిగింపు తదితర అంశాలను, ప్రజా ఆరోగ్య విభాగమునకు పలు అంశాలను సభ్యులు చర్చించడం జరిగినవని, అలాగే ముఖ్యంగా ఇంజనీరింగ్ విభాగం కు సంబంధించి సుమారు రూ. 31.03 కోట్ల తో పలు అభివృద్ధి పనులకు స్థాయి సంఘం సభ్యులు ఆమోదించార ని చైర్ పర్సన్ , విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు తెలిపారు. ఈ సమావేశంలో జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి ఈ ఎన్ వి నరేష్ కుమార్, డిసి(ఆర్) ఎస్.శ్రీనివాసరావు, జోనల్ కమిషనర్లు ఇప్పి నాయుడు, కె.శివ ప్రసాద్, ఎమ్.మల్లయ్య నాయుడు, బి.ఆర్.ఎస్.శేషాద్రి, బి.హేమావతి, కార్యదర్శి బి.వి రమణ, పర్యవేక్షక ఇంజనీర్లు గోవిందరావు, కె.శ్రీనివాసరావు, కృష్ణారావు, సంపత్ కుమార్, కార్యనిర్వహక ఇంజనీర్లు, ఉపకార్య నిర్వహక ఇంజనీర్లు, బయాలజిస్ట్ సాంబమూర్తి, ఏ ఎమ్ ఓ హెచ్ లు, పలువురు రెవిన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీఐశ్వర్య లక్ష్మి అమ్మవారి శ్రావణమాసోత్సవాల ఆహ్వాన శుభ పత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర-భీమిలి : భీమిలి శ్రీ ఐశ్వర్య వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రీ ఐశ్వర్య లక్ష్మీ అమ్మవారి శ్రావణ మాసోత్సవాల ఆహ్వాన శుభపత్రిక ఆవిష్కరించారు. ఆలయ ట్రస్టీస్ కలిగొట్ల శ్రీరామచంద్ర మూర్తి, కలిగొట్ల సూర్య నారాయణమూర్తి, కలిగొట్లభానోజీరావు, కలిగొట్ల శ్రీనివాసరావు, తాతాజీ, కృష్ణ వాచేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమంలో ఆలయ అర్చక పురాణం శేష బృందం, భక్తులు, ఇతర ఆలయ సభ్యులు పాల్గొన్నారు.

పద్మనాభం మండలంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం



విశాలాంధ్ర -పద్మనాభం : మండలంలోని స్వర్ణాంధ్ర స్వచంద్ర కార్యక్రమాన్ని మండలంలోని అన్ని శాఖల అధికారులు, నాయకులు ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొని స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ఉద్దేశాన్ని ర్యాలీల ద్వారా ప్రజల్లో అవగాహన కార్యక్రమాన్ని చేశారు .ప్రతి ఒక్కరూ కూడా వ్యక్తిగత శుభ్రతతో పాటు సామాజిక శుభ్రతను పాటించాలని చెత్తను ఎక్కడపడితే అక్కడ వెయ్యకూడదని అన్నారు .మనతోపాటు మన పరిసరాలు కూడా ఎంత స్వచ్ఛంగా ఉంటే మనం అంత పరిపూర్ణ ఆరోగ్యంతో ఉంటామని తెలియజేశారు .తడి చెత్త పొడి చెత్త ఇంటి వద్దనే వేరు చేయాలని అన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడగలిగినట్లయితే మనం మరింత ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చని తెలియజేశారు .అనంతరం అందరూ కలిసి మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ ర్యాలీ లతో అవగాహన కార్యక్రమం చేశారు .ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ,మండల అభివృద్ధి కార్యాలయ సిబ్బంది రెవెన్యూ సిబ్బంది ఇతర శాఖల సిబ్బంది ప్రజా ప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అడవివరం ప్రాథమిక పాఠశాలను డీఈఓ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-సింహాచలం: గ్రేటర్ విశాఖ 98వ వార్డ్ పరిధిలో ఉన్న అడవివరం ప్రాథమిక పాఠశాలను శనివారం జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రేమ్ కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా పదవతరగతి విద్యార్థులతో మాట్లాడి తెలుగు, ఇంగ్లీషు సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలను అడిగి విద్యార్థుల స్థాయిని పరిశీలించారు అనంతరం 6వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న సంసిద్ధతా కార్యక్రమాన్ని పరికలించారు. విద్యార్థుల సంసిద్ధతి కార్యక్రమంలోని ఇంగ్లీషు, తెలుగు అభ్యసన కృత్యాలు చేసిన తీరును పరిశీలించి కొన్ని పదాలు డిక్టేషన్ వ్రాయించినారు. జిల్లా విద్యాశాఖాధికారి విద్యార్థుల అభ్యసన సామర్థాలు మెరుగుపరచడానికి ఉపాధ్యాయులంతా కృషిచేయాలని, ముఖ్యంగా 6వ తరగతిలో చేరిన విద్యార్థులకు గణితం, సైన్సు, ఇంగ్లీషు సబ్జెక్టులలో బేసిక్ సామర్థ్యలను అందించడమే గాకుండా ఇంగ్లీషు, తెలుగు ధారాళంగా చదివేలా కృషి చేయాలిన్ సూచించారు. 10 వ తరగతి విద్యార్థులందరూ ఉత్తీర్ణులయ్యేలా సి, డి విద్యార్థులపై దృష్టి సారించి వారికి ఇప్పటి నుండే ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తెలిపారు. విద్యాశక్తి కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజు సాయంత్రం 4గంటల 10 తరగతుల విద్యార్థులకు ప్రత్యేక తూశ నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వం విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ఆ ఉపాధ్యాయులందరికి ఆయా సబ్జెక్టులకు సంబంధించిన కరదీపికలు అందించడం జరిగిందని, వాటిని అనుసరించడం ద్వారా ఉపాధ్యాయుని బోధనా సామర్థ్యం పెరుగుతుందని, ప్రతి ఉపాధ్యాయుడు టీచర్ హాండ్ బుక్కు సతుర్ధంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. పాఠశాల ఇంగ్లీష్ స్కూలు అసిస్టెంట్ నుండి 5 గంటల వరకు 6 నుండి సుసర్ల పద్మావతి స్వతంగా తయారు చేసిన 10వ పతింగతి ఇంగ్లీష్ మెటీరియల్ను విద్యార్థులందరికి ఉచితంగా డి.ఈ.ఓ అందజేశారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో అనేక సంస్కరణలు తీసుకొని వచ్చిందని, ప్రతి తల్లి ఖాతాలో తల్లికి వందనం ద్వారా విద్యార్థుల చదువునిమిత్తం 13 వేల రూపాయలు జమచేయడం జరిగిందని, సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లలో భాగంగా ప్రతి విద్యార్థికి మూడు జతల యూనిఫారం, స్కూలు బేగ్, పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, బూట్లు అందించడం జరిగిందని, ఉపాధ్యాయు లందరూ పాఠశాల ఎన్ రోల్మెంట్ పెంచడానికి కృషి చేయాలని విద్యలో నాణ్యతా ప్రమాణాలు పెంచడానికి కృషి చేయడం. ప్రభుత్వం అయలు చేస్తున్న పథకాలు విద్యార్థులందరకూ పూర్తి స్థాయిలో అందేటట్లు కృషిచేయడం , సమయపాలన పాటించడం వంటి విషయాలలో ఉపాధ్యాయులు సమర్థవంతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అందుకు గాను అనంతరం - "స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర" కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇమంది పైడిరాజు గారు పాఠశాల సమగ్ర సమాచారాన్ని, ప్రగతిని, చేపడుతున్న కార్యక్రమాలను, ఎన్రోల్మెంట్ మొదలైన వివరాలన్నీ జిల్లా విద్యాశాఖాధికారి వారికి వివరించారు.

అంటువ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు

విశాలాంధ్ర-భీమిలి : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు, సలహాలు తప్పకుండా పాటించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు ప్రజలకు విజ్ఞప్తి చేసారు. శనివారం స్వచ్ఛ సర్వేక్షన్ లో భాగంగా భీమిలి జోన్ 3వ డివిజన్ ఎగువపేటలో భీమిలి జోనల్ అధికారులు నిర్వహించిన కార్యక్రమానికి గంటా నూకరాజు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ముందుగా వాడవాడలా పారిశుధ్య సిబ్బంది, విఆర్పిలు, స్థానిక మహిళలతో కలసి ర్యాలీ నిర్వహించి అంటువ్యాధులపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. వర్షాకాలం కావడంతో డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు ఎక్కువగా వస్తున్నాయని అన్నారు. శానిటరీ ఇన్స్పెక్టర్ బి. మహాలక్ష్మి నాయుడు సమక్షంలో పారిశుధ్య సిబ్బంది బాగా పనిచేస్తున్నా స్థానిక ప్రజలు కూడా చుట్టూ ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో పూర్తిస్థాయి అవగాహనతో ఉండాలని కోరారు. ఎప్పటికప్పుడు బ్లీచింగ్ చేయడం, తడిచెత్త, పొడిచెత్త సేకరణలో పారిశుధ్య సిబ్బంది పనితీరు బ్రహ్మాండంగా ఉందని వారికి మా కృతజ్ఞతలు అని అన్నారు. పసిపిల్లలు, బాలింతలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఏదైనా సమస్య ఉంటే దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లడం లేదా ఆశా వర్కర్ల యొక్క సలహాలు, సూచనలు తీసుకోవాలని కోరారు. డెంగ్యూ చాలా ప్రమాధకరమని తెల్లరక్త కణాలు క్షీణించడంతో శరీరంలో రక్తం యొక్క నిల్వ తగ్గడం వలన అనారోగ్యం వస్తుందని అన్నారు. అందువలన దయచేసి ప్రజలందరూ పారిశుధ్య సిబ్బంది యొక్క సలహాలు, సూచనలు తీసుకొని ఆరోగ్యం, పరిశుభ్రత విషయంలో అవగాహనతో ఉండాలని గంటా నూకరాజు విజ్ఞప్తి చేసారు.ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ బి. మహాలక్ష్మి నాయుడు, మేస్త్రి రేగాని రవి, శానిటరీ సెక్రటరీలు మనోజ్, సురేష్, శివ, వరప్రసాద్, త్రివేణి మరియు ఆర్పీలు పాల్గొన్నారు.

వర్షాకాలంలో ఇఎన్‌టీ ఇన్ఫెక్షన్లు

విశాలాంధ్ర-విశాఖపట్నం : వర్షాకాలంలో చెవి, ముక్కు మరియు గొంతును కాపాడుకోవడం చాలా ముఖ్యం అని పలు ఇన్ఫెక్షన్లు చోటు చేసుకుంటాయని లయన్స్ క్యాన్సర్ జనరల్ ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్టీ ఆచార్య ఉమామహేశ్వర అన్నారు. వర్షాకాలంలో పెరిగిన తేమ, నీటి స్తబ్దత మరియు వైరల్ కార్యకలాపాల వలన పిల్లలు, పెద్దలు ఈ ఎన్ టీ ఇన్ఫెక్షన్లకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. సకాలంలో సంరక్షణ మరియు పరిశుభ్రత, అసౌకర్యం మరియు సమస్యలను తగ్గించ గలవు. ఆ వర్షాకాలపు రోజులలో సురక్షితంగా మరియు ఆరోగ్యంగా ఉండండి. వర్షాకాలం చల్లని గాలిని తెస్తుంది మరియు వర్షాలను స్వాగతిస్తుంది, కానీ ఇది చెవి, ముక్కు మరియు గొంతు ఇన్ఫెక్షన్ల పెరుగుదలను కూడా ప్రేరేపిస్తుందన్నారు. పెరిగిన తేమ, హెచ్చుతగ్గుల ఉష్ణోగ్రతలు మరియు కలుషితమైన గాలి, నీరు కారణంగా పిల్లలు మరియు పెద్దలు ఇద్దరూ ఈ సమస్యలను ఎదుర్కొనే ప్రమాదం ఎక్కువగా ఉంటుందన్నారు. చెవుల్లో వర్షపు నీరు పడకుండా చూసుకోండి మరియు అవి తడిసిపోతే వాటిని సున్నితంగా ఆరబెట్టండన్నారు. ఇన్ఫెక్షన్ ప్రమాదాన్ని తగ్గించడానికి పిల్లలు భారీ వర్షం సమయంలో ఇంటి లోపల ఉండమని ప్రోత్సహించాలి. రద్దీగా ఉండే ప్రాంతాల్లో శుభ్రమైన మాస్క్‌ను ఉపయోగించండి, ఐస్-కోల్డ్ డ్రింక్స్‌ను నివారించండి మరియు సైనస్ లేదా గొంతు ఇన్ఫెక్షన్‌లను ప్రేరేపించే దుమ్ము లేదా బూజుపట్టిన వాతావరణాలకు దూరంగా ఉండండి. సమతుల్య ఆహారం, తగినంత నిద్ర మరియు హైడ్రేషన్‌తో రోగనిరోధక శక్తిని పెంచుకోండి. గొంతు నొప్పి లేదా చెవిలో అసౌకర్యం యొక్క మొదటి సంకేతం వద్ద, వినికిడి లోపం లేదా దీర్ఘకాలిక సైనసిటిస్ వంటి సమస్యలను నివారించడానికి డాక్టర్ ను సంప్రదించండి అని సూచించారు.

సేవ చేయడంలోనే నిజమైన ఆనందం

విశాలాంధ్ర-మల్కాపురం : నిరుపేదలకు సేవ చేయడంలోనే నిజమైన ఆనందం దాగి ఉందని నవజీవన్ డాన్ బాస్కో ఫాదర్ అరుల్ దాస్ అన్నారు. స్థానిక మురికివాడల్లో నివసిస్తున్న పేద ప్రజలను, విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యతోనే పేదరికం నుండి బయట పడగలమని అన్నారు. బాగా చదువుకుని, నైపుణ్యాలను పెంచుకొని, ఉపాధిని పొంది, జీవన ప్రమాణ స్థాయిని పెంచుకోవాలన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న సెయింట్ ఆన్స్ కళాశాలకు చెందిన సీనియర్ సిస్టర్ కార్లీన్ మాట్లాడుతూ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు పేద ప్రజల సంక్షేమానికి నిధులను సమీకరించాలన్నారు. తాము చదువుకోవడమే కాకుండా ఇతర పేద ప్రజల పిల్లలు కూడా చదువుకునేలా కళాశాల విద్యార్థులు చేయూతనివ్వాలని అన్నారు. అనంతరం మురికివాడలలో నవజీవన్ డాన్ బాస్కో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత ట్యూషన్ సెంటర్లకు నగదు రూపంలో సహాయాన్ని అందజేశారు. స్థానిక వృద్ధులకు దుప్పట్లను, మహిళలకు చీరలను పంపిణీ చేశారు. చిన్నారులకు మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ కళాశాల జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయాదేవి, అధ్యాపకులు డాక్టర్ ప్రశాంతి, అంకిత, జ్యోత్స్న, స్టూడెంట్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు. సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థినులు ఆటపాటలతో, నృత్యంతో స్థానికులను అలరించారు.

శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థి నాయకుని ఎన్నికలు

విశాలాంధ్ర-పెందుర్తి : విద్యార్థులు చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని పెందుర్తి శ్రీచైతన్య టెక్నో స్కూల్ ప్రధానోపాధ్యాయులు పి.తారకేశ్వరరావు అన్నారు. పాఠశాలలో శనివారం ప్రజాస్వామ్య యుతంగా, రహస్య బ్యాలెట్ పద్ధతి ద్వారా స్టూడెంట్ లీడర్ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎన్నికలే ప్రామాణికమని ఎన్నికల వ్యవస్థ గురించి విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఏవిధంగా జరుగు తాయో అవగాహన కల్పించారు. ఉత్తరాంధ్ర పాఠశాలల ఏజీఎం ఎం.వి సురేష్, రీజనల్ ఇన్చార్జ్ మహమ్మద్ అలీ విజయం సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలియజేసి, విద్యార్థులు చిన్నప్పుడే లక్ష్యాలు నిర్దేశించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డీన్ ఎం.ఆర్.వి శేషగిరి, సి బ్యాచ్ ఇన్చార్జ్ హఫ్సా, ఐకాన్ ఇన్చార్జ్ టి.లక్ష్మణమూర్తి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.